జైస్వాల్ జోరు దూబే దూకుడు

అర్ధసెంచరీలతోవిజృంభణ

అఫ్గన్‌పై భారత్ ఘన విజయం

సిరీస్‌లో 2-0తో ముందంజ

జైస్వాల్ (68)

భారత్ ఖాతాలో మరో టీ20 సిరీస్. గత ఐదేండ్ల(2019) నుంచి ప్రత్యర్థికి సిరీస్ చేజార్చుకోని టీమ్‌ఇండియా అప్రతిహత విజయయాత్రను కొనసాగిస్తున్నది. మరో మ్యాచ్ మిగిలుండగానే అఫ్గానిస్థాన్‌తో సిరీస్‌ను భారత్ కైవసం చేసుకుంది. అఫ్గన్ నిర్దేశించిన లక్ష్యఛేదనలో కెప్టెన్ రోహిత్‌శర్మ గోల్డెన్ డకౌట్‌గా వెనుదిరిగినా...కొత్త కుర్రాళ్లు యశస్వి జైస్వాల్, శివమ్ దూబే దుమ్మురేపే ఇన్నింగ్స్‌తో ఇండోర్‌లో బౌండరీల మోత మోగించారు. తొలుత అక్షర్‌పటేల్ స్పిన్ తంత్రంతో అఫ్గన్ 172 పరుగులకు పరిమితమైంది. నయీబ్ మినహా ఎవరూ ఆకట్టుకోలేకపోయారు.

ఇండోర్: భారత్ దుమ్మురేపింది. అఫ్గానిస్థాన్‌తో ఆదివారం జరిగిన రెండో టీ20 పోరులో టీమ్‌ఇండియా 6 వికెట్ల తేడాతో(26 బంతులు మిగిలుండగానే) ఘన విజయం సాధించింది. అఫ్గన్ నిర్దేశించిన 173 పరుగుల లక్ష్యాన్ని టీమ్‌ఇండియా 15.4 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించింది. యశస్వి జైస్వాల్(34 బంతుల్లో 68, 5ఫోర్లు, 6 సిక్స్‌లు), శివమ్ దూబే(32 బంతుల్లో 63 నాటౌట్, 5ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధసెంచరీలతో విజృంభించారు. ఓపెనర్ రోహిత్‌శర్మ(0) వరుసగా రెండో మ్యాచ్‌లో పరుగుల ఖాతా తెరువకుండానే సున్నాకు వెనుదిరిగాడు. దాదాపు 14 నెలల తర్వాత తిరిగి పొట్టి ఫార్మాట్‌లో అడుగుపెట్టిన విరాట్ కోహ్లీ(29) టచ్‌లోకి వచ్చాడు. కరీమ్ జనత్(2/13) రెండు వికెట్లు పడగొట్టాడు. మొదట బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్థాన్ 20 ఓవర్లలో 172 పరుగులకు ఆలౌటైంది. గుల్బాద్దిన్ నయీబ్(57) అర్ధసెంచరీతో ఆకట్టుకోగా, సహచర బ్యాటర్లు స్వల్ప స్కోర్లకు పరిమితమయ్యారు. ప్రత్యర్థి తన బౌలింగ్‌తో కట్టడి చేసిన అక్షర్ పటేల్(2/17)కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మూడో మ్యాచ్ ఈ నెల 17న బెంగళూరులో జరుగనుంది.

దూబే (63 నాటౌట్)

జైస్వాల్, దూబే ధమాకా:

బ్యాటింగ్ ప్యారడైజ్‌గా పేరు గాంచిన ఇండోర్‌లో యువ బ్యాటర్లు యశస్వి జైస్వాల్, శివమ్ దూబే ఆకాశమే హద్దుగా చెలరేగారు. సీనియర్లు ఆకట్టుకోలేని చోట అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ అఫ్గన్ బౌలర్లను ఊచకోత కోశారు. ఫజుల్లా ఫరుఖి వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్ మొదటి బంతినే ఫోర్‌గా మలిచిన జైస్వాల్ తనలో కొత్త కోణాన్ని ఆవిష్కరించాడు. గాయంతో తొలి మ్యాచ్‌కు దూరమైన ఈ ముంబై కుర్రాడు..అఫ్గన్ బౌలర్లను ఉతికి ఆరేశాడు. రోహిత్ శర్మ తాను ఎదుర్కొన్న తొలి బంతికే క్లీన్‌బౌల్డ్‌గా వెనుదిరిగినా..ఆత్మవిశ్వాసం కోల్పోకుండా యశస్వి తన దూకుడు కనబరిచాడు. ఫారుఖిని మరోమారు లక్ష్యంగా చేసుకున్న జైస్వాల్ రెండు భారీ సిక్స్‌లతో అరుసుకున్నాడు. ఈ క్రమంలో ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపడ్డ ఈ యువ బ్యాటర్ మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. ముజిబ్ వేసిన ఐదో ఓవర్లో జైస్వాల్ హ్యాట్రిక్ ఫోర్లు బాదితే..కోహ్లీ కండ్లు చెదిరే రీతిలో ఫోర్ కొట్టాడు. కుదురుకుంటున్న తరుణంలో నవీనుల్ హక్ బౌలింగ్‌లో కోహ్లీ బౌట్ కావడంతో పవర్ ప్లే ముగిసే సరికి టీమ్‌ఇండియా రెండు వికెట్ల నష్టానికి 69 పరుగులు చేసింది. ఆ తర్వాత క్రీజులో కొచ్చిన శివమ్ దూబే..జైస్వాల్‌కు జత కలిశాడు. వీరిద్దరు అఫ్గన్ బౌలర్లను ఆడుకున్నారు. నబీ పదో ఓవర్లో దూబే మూడు భారీ సిక్స్‌లతో విరుచుకుపడితే తానేం తక్కువ కాదన్నట్లు చెలరేగిన జైస్వాల్ 27 బంతుల్లో అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని విడగొట్టేందుకు అఫ్గన్ కెప్టెన్ ఎన్ని రకాలుగా ప్రయత్నించినా లాభం లేకపోయింది. అయితే జనత్ బౌలింగ్‌లో షాట్ కోసం ప్రయత్నించినా..జైస్వాల్ కీపర్ క్యాచ్‌తో వెనుదిరిగాడు. దీంతో మూడో వికెట్‌కు 92 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. జైస్వాల్ స్థానంలో క్రీజులోకొచ్చిన రింకూసింగ్(9 నాటౌట్)తో కలిసి దూబే గెలుపు లాంఛనాన్ని పూర్తిచేశాడు. ఈ క్రమంలో వరుసగా రెండో మ్యాచ్‌లో అర్ధసెంచరీ ఖాతాలో వేసుకున్నాడు.

12 అంతర్జాతీయ టీ20ల్లో భారత కెప్టెన్ రోహిత్‌శర్మ డకౌట్ల సంఖ్య. రోహిత్ తర్వాత చక్‌బవ, సౌమ్యసర్కార్(11), ఉమర్ అక్మల్, బిల్షాన్, శనక(10) ఉన్నారు.

15 జూన్ 2019 నుంచి భారత్ స్వదేశంలో 15టీ20 సిరీస్‌లు ఆడింది. ఇందులో 13 సిరీస్‌లు కైవసం చేసుకున్న టీమ్‌ఇండియా రెండింటిని డ్రా చేసుకుంది.

సంక్షిప్త స్కోర్లు

అఫ్గానిస్థాన్: 20 ఓవర్లలో 172 ఆలౌట్(గుల్బాద్దిన్ 57, జద్రాన్ 23, అర్ష్‌దీప్‌సింగ్ 3/32, అక్షర్‌పటేల్ 2/17),
భారత్: 15.4 ఓవర్లలో 173/4(జైస్వాల్ 68, దూబే 63 నాటౌట్, జనత్ 2/13, ఫారుఖి 1/28)

సాఫ్ట్‌బాల్ విజేత తెలంగాణ

దక్షిణాది సీనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నీ

జనగామ చౌరస్తా: దక్షిణాది రాష్ట్రాల 20వ సీనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నీలో ఆతిథ్య తెలంగాణ విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన మహిళల ఫైనల్లో తెలంగాణ 6-5తో కేరళపై అద్భుత విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్‌కు మూడో స్థానం దక్కింది. పురుషుల విభాగంలో ఆంధ్ర ప్రదేశ్ 10-0తో తెలంగాణపై గెలిచి ట్రోఫీ కైవసం చేసుకోగా, కేరళ మూడో స్థానానికి పరిమితమైంది. ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా సాఫ్ట్‌బాల్ అసోసియేషణ్ రాష్ట్ర చైర్మన్ సాంబ శివరావు, లవకుమార్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ పాఠశాల మైదానంలో మూడు రోజులుగా జరిగిన టోర్నీలో ఏడు దక్షిణాది రాష్ట్రాల నుంచి 224 మంది ప్లేయర్లతో పాటు 28 మంది కోచ్‌లు పాల్గొన్నారు.

కబడ్డీ చాంప్స్ రంగారెడ్డి, నల్లగొండ

గజ్వేల్‌అర్బన్, జనవరి14: గజ్వేల్ పట్టణంలో గత నాలుగు రోజులుగా హోరాహోరీగా సాగుతున్న 49వ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ క్రీడాపోటీలు ఆదివారంతో ముగిసాయి. 33జిల్లాల నుంచి బాలుర, బాలికల జట్లు పాల్గొన్న ఈ క్రీడాపోటీలో జూనియర్ బాలికల విభాగంలో నల్లగొండ 55-42 తేడాతో రంగారెడ్డిపై ఘన విజయం సాధించింది. బాలుర కేటగిరీలో రంగారెడ్డి 34-27తో నల్లగొండపై గెలిచి టైటిల్ దక్కించుకుంది. ఫైనల్ కబడ్డీ పోటీలు మరింత హోరాహోరీగా సాగగా నిర్వాహకులు, అతిథులు, ప్రేక్షకులు ఎంతో ఉత్కంఠతో వీక్షించారు. విజేతలకు మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ టీడీసీ చైర్మన్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, రాష్ట్ర ఒలంపిక్, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌యాదవ్, మహిళ కమిషన్ చైర్మన్ రాజ్యలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి శివకుమార్ తదితరులు ట్రోఫీలను అందజేశారు.

రన్నరప్ సాత్విక్ జోడీ

- మలేషియా ఓపెన్

జకార్తా: మలేషియా బ్యాడ్మింటన్ ఓపెన్‌లో భారత స్టార్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి రన్నరప్‌గా నిలిచింది. టోర్నీలో ఆద్యంతం అద్భుత ప్రదర్శన కనబరిచిన సాత్విక్, చిరాగ్ జోడీ ఆదివారం జరిగిన ఫైనల్లో 21-9, 18-21, 17-21తో ప్రపంచ నంబర్‌వన్ జంట లియాంగ్ వీ కెంగ్, వాంగ్ చాంగ్ చేతిలో పోరాడి ఓడింది. మలేషియా సూపర్ ఓపెన్‌లో తొలిసారి ఫైనల్ ఫైట్‌లో నిలిచిన భారత జోడీగా నిలిచిన సాత్విక్, చిరాగ్ టైటిల్ కలను నెరవేర్చుకోలేకపోయారు. తొలి గేమ్‌లో11-7తో ఆధిక్యం కనబరిచిన యువ ద్వయం 21-9తో కైవసం చేసుకుంది. అయితే చైనా జోడీ పుంజుకుని పోటీలోకి రావడంతో వీరు వరుస గేమ్‌లు కోల్పోవాల్సి వచ్చింది. తమ ర్యాంకింగ్‌కు తగ్గట్లు లియాంగ్ వీ, వాంగ్ చాంగ్ చెలరేగడంతో సాత్విక్, చిరాగ్ దగ్గర సరైన సమాధానం లేకపోయింది. పోటీనిచ్చేందుకు ప్రయత్నించినా..అనవసరపు షాట్లతో పాయింట్లు కోల్పోయారు.

తెలంగాణ ముందంజ

నేషనల్ ఫాస్ట్-5 నెట్‌బాల్ టోర్నీ

మహబూబ్‌నగర్‌టౌన్, జనవరి 14: జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో నేషనల్ ఫాస్ట్-5 సీనియర్ మహిళల, పురుషుల నెట్‌బాల్ టోర్నీ హోరాహోరీగా సాగుతున్నది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో పురుషుల విభాగంలో తెలంగాణ టీమ్ 21-5తో ఉత్తరాఖండ్‌పై గెలువగా, తెలంగాణ మహిళల జట్టు 30-5తో బెంగాల్‌పై గెలిచి శుభారంభం చేశాయి. పురుషుల కేటగిరీలో కేరళ 32-12తో తమిళనాడుపై, చత్తీస్‌గఢ్ 25-22తో బీహార్‌పై, కర్ణాటక 31-14తో మహరాష్ట్రపై, గోవా 27-15తో పుదుచ్చేరిపై, ఉత్తరప్రదేశ్ 30-13తో మధ్యప్రదేశ్‌పై, హర్యానా 44-22తో ఆంధ్రప్రదేశ్‌పై, జమ్ముకశ్మీర్ 24-10తో తమిళనాడుపై, ఆంధ్రప్రదేశ్ 28-14తో బెంగాల్‌పై గెలిచాయి. మహిళల కేటగిరీలో తమిళనాడు 25-18తో పుదుచ్చేరిపై, కర్ణాటక 20-12తో మహరాష్ట్రపై, బీహార్ 29-11తో ఏపీపై, ఢిల్లీ 14-10తో రాజస్థాన్‌పై, హిమాచల్‌ప్రదేశ్ 22-16తో బీహార్‌పై, పంజాబ్ 19-14తో యూపీపై, కేరళ 31-5తో మధ్యప్రదేశ్‌పై, రాజస్థాన్ 22-21తో తమిళనాడుపై గెలిచాయి.

18 నుంచి ఉప్పల్ టెస్టు టికెట్లు

- రిపబ్లిక్ డే రోజు జవాన్లకు ఫ్రీ ఎంట్రీ
- హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఉప్పల్ స్టేడియం వేదికగా ఈ నెల 25 నుంచి మొదలయ్యే భారత్, ఇంగ్లండ్ తొలి టెస్టు కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నది. ఈ నెల 18 నుంచి టెస్టు మ్యాచ్ టికెట్లు అభిమానులకు అందుబాటులో ఉంటాయని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు ఆదివారం పేర్కొన్నారు. పేటీఎమ్ ఇన్‌సైడర్ మొబైల్ యాప్‌తో పాటు వెబ్‌సైట్ www.insider.in టికెట్లు విక్రయించనున్నారు. జింఖానాలో ఈ నెల 22 నుంచి ఆఫ్‌లైన్ టికెట్లను అందుబాటులో ఉంచనున్నారు. టెస్టు మ్యాచ్ టికెట్ ధర కనిష్ఠంగా రూ.200 కాగా, గరిష్టంగా 4వేలుగా నిర్ణయించారు. సామాన్యులకు అందుబాటులో ఉంటాయని జగన్ తెలిపారు. ఈ నెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా భారత సాయుధ దళాలకు ఉచితంగా మ్యాచ్ చూసే అవకాశం కల్పిస్తున్నామన్నారు. 25 వేల మంది విద్యార్థులకు ఉచితంగా భోజన సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు.

భారత్ పతక జోరు

జకార్తా: ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్ టోర్నీలో భారత షూటర్ల పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. పురుషుల 25మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ విభాగం ఫైనల్లో యువ షూటర్ యోగేశ్‌సింగ్ 572 పాయింట్లతో పసిడి పతకంతో మెరిశాడు. అదే దూకుడు కనబరుస్తూ అమిత్‌కుమార్, ఓం ప్రకాశ్‌తో కలిసి యోగేశ్‌సింగ్ 1690 పాయింట్లతో మరో స్వర్ణాన్ని అందించాడు. టోర్నీలో భారత్ ప్రస్తుతం14 స్వర్ణాలు సహా 10 రజతాలు, 8 కాంస్యాలతో అగ్రస్థానంలో కొనసాగుతున్నది. ఉపఖండ టోర్నీలో భారత్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన కావడం విశేషం.

కివీస్‌దే రెండో టీ20

హామిల్టన్(న్యూజిలాండ్): పొట్టి ఫార్మాట్‌లో న్యూజిలాండ్ వరుస విజయాల జోరు కొనసాగుతున్నది. ఆదివారం జరిగిన రెండో టీ20లో కివీస్ 21 పరుగుల తేడాతో పాక్‌పై విజయం సాధించింది. తొలుత ఓపెనర్ ఫిన్ అలెన్(74) అర్ధసెంచరీతో కివీస్ 20 ఓవర్లలో 194/8 స్కోరు చేసింది. సహచర బ్యాటర్లు పెద్దగా ఆకట్టుకోలేని వేళ అలెన్..పాక్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ పరుగులు సాధించాడు. హారిస్ రవూఫ్(3/38), అఫ్రిదీ(2/43) ఆకట్టుకున్నారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన పాక్ 19.3 ఓవర్లలో 173 పరుగులకు పరిమితమైంది. బాబర్ ఆజమ్(66), ఫకర్ జమాన్(50) అర్ధసెంచరీలతో రాణించారు. మిల్నె(4/33) నాలుగు వికెట్లతో విజృంభించాడు. అలెన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో కివీస్ ప్రస్తుతం 2-0 ఆధిక్యంలో కొనసాగుతున్నది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.